క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నేడు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు డెక్కతిపాలెం కమ్యూనిటీ హాలు వద్ద బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు జెడ్సీ బి.రాము తెలిపారు. చిన బజారు వార్డు సచివాలయం పరిధిలో ప్రజలంతా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇంటింటా అయోధ్య అక్షింతల పంపిణీ


చిప్పాడలో అక్షింతలు పంపిణీ చేస్తున్న సుత్తమ్మతల్లి భవాని పీఠం ప్రతినిధులు

తగరపువలస: అయోధ్య శ్రీరామ మందిరంలో ఈ నెల 22న బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మంగళవారం భీమిలి మండలం చిప్పాడలో శ్రీసుత్తమ్మతల్లి భవానీ పీఠం, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఇంటింటా అక్షింతలు పంపిణీ కార్యక్రమం జరిగింది. పంచాయతీలోని చిప్పాడ, సిటీనగర్, ఆశిపాలెం, కొసనవానిపాలెం, నమ్మివానిపాలెం, కంచేరుపాలెం తదితర గ్రామాల్లోని 1300 ఇళ్లకు ఈ అక్షింతలు చేరవేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తగరపువలస/భీమిలి: జీవీఎంసీ భీమిలి జోన్‌లో సోమవారం రెండు వేర్వేరు ప్రదేశాలలో పేకాట ఆడుతున్న 21 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1.05 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఒకటో వార్డు బైపాస్ రోడ్డు బాలాజీనగర్‌లో నలుగురి నుంచి రూ.14,100 అలాగే బ్యాంకు కాలనీ వద్ద 17 మంది నుంచి రూ.91,650 నగదుతో పాటు పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గేమింగ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్టు భీమిలి సీఐ డి.రమేష్ తెలిపారు.

కబడ్డీ విజేతలకు నగదు బహుమతులు


విజేతలకు నగదు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: సంక్రాంతి సందర్భంగా మండలంలోని మద్దిలో మూడు రోజులు నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ క్రీడా పోటీల్లో విజేతలకు సోమవారం రాత్రి నగదు బహుమతులు పంపిణీ చేశారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు చేతులమీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఇడదాసరి టీమ్‌కు రూ.7వేలు, ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్న ఎన్నుపాడు టీమ్‌కు రూ.4వేలు, తృతీయ స్థానాన్ని పొందిన ఏనుగులపాలెం టీమ్‌కు రూ.2వేలు నగదు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ పాల్గొన్నారు.

మాజీ సైనికులకు సత్కారం

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్మీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు ప్రభావతి ఆధ్వర్యంలో మిలటరీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాల్లో పనిచేసిన మాజీ సైనికులను క్లబ్‌కు ఆహ్వానించి వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. సర్వీస్‌లో వారు నేర్చుకున్న క్రమశిక్షణ, నిజాయతీ, దేశభక్తి, వారి అనుభవాలను చక్కగా వివరించారు. దేశం కోసం ప్రాణాలు ఫణంగా పెట్టి సేవలందించిన సైనికులను సత్కరించుకోవడం మన బాధ్యత అని ప్రభావతి అన్నారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ గవర్నర్ శుభ, కార్యదర్శి ఎం.జయ, సభ్యులు పాల్గొన్నారు.

పండగ వేళ పరసల సందడి

సంక్రాంతి పండగ వచ్చిందంటే గ్రామాల్లో పరసల పరంపర మొదలవుతుంది. కనుమ రోజు మొదలుకుని దాదాపు నెల రోజుల పాటు పల్లెల్లో జరిగే గ్రామదేవతల తీర్థాలకు వేలాదిగా జనం తరలి వస్తారు. గ్రామదేవతలకు మొక్కులు చెల్లించడానికి అశేషంగా తరలివచ్చే జనంతో సాయంత్రం వేళ ఇసుక వేస్తే రాలనంతగా కిక్కిరిసి ఉంటుంది. ఇక బాణసంచా వెలుగులు.. సాముగరిడీలు.. నవదుర్గల వేషాలు.. డప్పు వాయిద్యాలు.. ఉయ్యాలలు.. జెయింట్ వీల్‌తో పాటు స్పెషల్ స్టాల్స్ వద్ద చిన్నాపెద్ద సందడితో పండగ ఉత్సాహం రెట్టింపవుతుంది.

- అచ్చియ్యమ్మ పేరంటాలు తీర్థానికి పోటెత్తిన జనం
- సాళ్ల వద్ద కోలాహలం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మధురవాడ: సంక్రాంతి పండగకు పరసల సందడి తోడైతే ఆ హుషారే వేరు. నియోజకవర్గంలో అచ్చియ్యమ్మ పేరంటాలు జాతరతో ఆ సందడి మొదలైంది. ఎండాడ శేఖరి వారి ఆడపడుచు.. మల్లయ్యపాలెం అల్లాడ వారి కోడలు అచ్చియ్యమ్మ పేరంటాలు జాతర మంగళవారం కనులపండువగా జరిగింది. మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద సుమారు 150 ఏళ్ల పై నుంచి కనుమ రోజున ఈ తీర్థం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో నిర్వహించిన తీర్థానికి మధురవాడ, సాగర్ నగర్, కొమ్మాది, పీఎంపాలెం పరిసర 14 పాత గ్రామ ప్రాంతాలకు చెందిన భక్తులు విశేషంగా తరలి వచ్చి, మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద ధర్మకర్తలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అల్లాడ ఉమా మహేశ్వరరావు, అల్లాడ వెంకటరావు, అల్లాడ లింగేశ్వరరావు, ఇతర సభ్యులు అల్లాడ సూర్యారావు, అల్లాడ గంగరాజు భక్తులతో కలసి అమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.


పేరంటాలు గుడి వద్ద పూజ చేస్తున్న ధర్మకర్తలు

ఆకట్టుకున్న 'సత్య హరిశ్చంద్ర'

తీర్థంలో భజనలు, కోలాటంతో పాటు సత్యహరిశ్చంద్ర నాటకం అలరించాయి. ఇందులో వీరబాహుడిగా వంకాయల మారుతీ ప్రసాద్ నటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కృష్ణుడిగా ఎస్.శివరామనాయుడు, హరిశ్చంద్రుడిగా కుమారి, కురిటి సత్యంనాయుడు, చంద్రమతిగా బెంకిలి అలివేణి చక్కని అభినయం కనబరిచారు.

నేడు కోదండ రాముడి తీర్థం

మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద బక్కన్నపాలెం రోడ్డులో వెలసిన శ్రీ గణపతి సాయినాథ సమేత కోదండ రామ ఆలయం వద్ద కోదండ రాముడు తీర్థాన్ని బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా కనుమ మరుసటి రోజు తీర్థం నిర్వహించడం వందల సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ ఆలయానికి విశాఖపట్నానికి చెందిన వర్ధిరాజు కృష్ణకుమారి కుటుంబీకులు అనువంశిక ధర్మకర్తలు. వీరు విదేశాల్లో స్థిరపడినా ఈ ఆలయం నిర్వహణ అంతా వారి సారథ్యంలోనే జరుగుతోంది.

ప్రాచీన కళలకు ఆదరణ

మధురవాడ: ప్రాచీన, సాంప్రదాయ కళలను మధురవాడ ప్రజలు ఆదరిస్తున్నారు. పండగల్లో ఎక్కడ చూసినా నాటకాలు, చిడతలు, చెక్కభజన, కోలాటం వంటివి దర్శనం ఇస్తున్నాయి. కళాకారులు చంద్రంపాలెం, మల్లయ్యపాలెం, నగరంపాలెం, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం తదితర ప్రాంతాల్లో పండగ సందర్భంగా ప్రదర్శనలు ఇచ్చారు. మంగళవారం చంద్రంపాలెం వాసులు దాసరికం, గరిడీ నిర్వహించారు. మల్లయ్యపాలెం వాసులు భజన చేశారు.


జాతరలో స్టాల్స్ వద్ద సందడి

సందడిగా సంక్రాంతి సంబరాలు

తగరపువలస: కార్మికవాడలో సంక్రాంతి సంబరాలు కనుల పండువగా జరిగాయి. వీధులను రంగవల్లులతో తీర్చిదిద్దారు. బంధువుల రాకతో గ్రామాలన్నీ కళకళలాడాయి. మంగళవారం కూడా మార్కెట్‌లో సందడి నెలకొంది. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు రామన్నపేటకు చెందిన మహిళలు ఉమ్మడిగా మూడు రోజుల పాటు ఉత్సవాలు జరిపించారు. వీధులను మామిడి తోరణాలు, చెరకు గడలతో అలంకరించి కూడలి వద్ద మట్టిపాత్రలలో పొంగలి తయారు చేసి వడ్డించారు. ఆటపాటలతో అలరించారు.

- చిట్టివలస ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలు, కుర్చీలాట, ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించారు. చిన్నారులకు ఫ్యాషన్ షో నిర్వహించారు. మిమిక్రీ, మ్యాజిక్ షో అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా సంఘ సేవకుడు వెంపాడ శ్రీనివాస రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అక్కరమాని రామునాయుడు, పిట్టా సురేష్, పరిమి భువనేశ్వరి పాల్గొన్నారు.
- బంగ్లామెట్టలోని ఎంఎఫ్‌సీ కార్ఖానాలో సంక్రాంతి సంబరాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. సిబ్బంది ఆటపాటలతో అలరించారు.

క్రికెట్ టోర్నీ విజేతల రైజింగ్ స్టార్స్ జట్టు

తగరపువలస: భీమిలి మండలం అమనాం పంచాయతీ నక్కెళ్లలపేటలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నీలో రైజింగ్ స్టార్స్ జట్టు ట్రోఫీ గెలుచుకుంది. రన్నర్‌గా రావాడ జట్టు నిలిచింది. 16 జట్లు పాల్గొన్న ఈ టోర్నీని మూడు రోజుల పాటు నిర్వహించారు.


ట్రోఫీతో విన్నర్స్ రైజింగ్ స్టార్స్ జట్టు


చిట్టివలసలో శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం


రామన్నపేటలో పొంగలి సిద్ధం చేస్తూ..


సత్యహరిశ్చంద్ర నాటకంలో ఓ ఘట్టం

పేదలకు వస్త్రాల పంపిణీ


కోరాడలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ మంజు భార్గవి, లక్ష్మణరావు

పద్మనాభం: మండలంలోని కోరాడ పంచాయతీ కోరాడ, గెద్దపేట గ్రామాల్లో మంగళవారం వైస్ ఎంపీపీ కోరాడ మంజు భార్గవి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తమ సొంత నిధులతో 500 మంది పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పేద మహిళలు పండగ పూట నూతన వస్త్రాలు ధరించాలని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో మంజు భార్గవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జోష్ నింపిన సంక్రాంతి సంబరాలు


శిల్పారామంలో సాంస్కృతిక నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు వేడుకగా నిర్వహించారు. ప్రత్యేక ఆకర్షణగా పల్లె జీవన విధానాన్ని ప్రతిబింబించే సంప్రదాయ నృత్యాలు నిలిచాయి. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని సోమవారం శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి , జానపద నృత్యాల ప్రదర్శన ప్రేక్షకులను ఆద్యంతం అలరించాయి. సంక్రాంతి పండగ ముఖ్య అంశంగా రూపొందించిన నృత్య రూపకం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. కళాకారులు యశ్మిత,పద్మ,సారిక,వేదిత తదితరులు కార్యక్రమాన్ని రక్తి కట్టించారు.

కనుమ రోజున.

జ్యోష్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన నృత్యాలు అదరహో అనిపించాయి. రామ శబ్దం,నోమి నోమిన్నాలో, ఏరువాకా సాగారో తదితర గీతాలకు చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమాలను స్థానిక పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

• నిర్మానుష్యం.. నిశ్శబ్దం

సంక్రాంతి సెలవులతో బోసిపోయిన ఏయూ


నిర్మానుష్యంగా పరిపాలన భవనానికి వెళ్లే రోడ్డు

ఏయూక్యాంపస్: సంక్రాంతి పండగ సెలవులతో ఆంధ్ర విశ్వవిద్యాలయం బోసిపోయింది. వరుసగా ఐదు రోజులు సెలవులు రావడంతో వర్సిటీ నిర్మానుష్యంగా మారింది. విద్యార్థులు, ఆచార్యులు, ఉద్యోగులు లేకపోవడంతో మొత్తం ఖాళీ అయిపోయింది. నగరవాసులు సైతం పండగలకు తమ స్వగ్రామాలకు వెళ్లిపోవడంతో ఏయూ నుంచి వాహనాల రాకపోకలు సైతం లేవు. దీనితో వర్సిటీలో ఏ మూలన చూసినా నిశ్శబ్దం తాండవించింది. కేవలం పక్షుల శబ్దాలు మినహా వర్సిటీలో ఎటువంటి రణగొణ ధ్వనులు వినిపించలేదు. అన్ని విభాగాలు విద్యార్థులు లేక బోసిపోయాయి. గురువారం నుంచి విశ్వవిద్యాలయం పూర్తి స్థాయిలో పనిచేయనుంది.


ఐఐఎం కూడలి వద్ద ఖాళీగా రహదారి


ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం వద్ద..


భౌతిక శాస్త్ర విభాగం వద్ద..

వైభవంగా మకరజ్యోతి దర్శనం


ఆలయం వద్ద వెలిగించిన మకరజ్యోతి



శ్రీ ధర్మశాస్త్ర సేవా పీఠంపై వెలుగుతున్న మకర జ్యోతి

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలోని అయ్యప్ప దేవాలయం వద్ద సోమవారం సాయంత్రం మకర జ్యోతి దర్శన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి వస్త్ర, పుష్ప అలంకరణలు, నెయ్యాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం వీరాంజనేయ అయ్యప్పసేవా సంఘం ఆధ్వర్యంలో గురుస్వామి బొండ బదరీనాథ్ ఇంటి నుంచి స్వామి వారి ఆభరణాలను తీసుకువచ్చారు. సాయంత్రం 6–18 గంటలకు ఆలయం వద్ద మకర జ్యోతిని వెలిగించి, పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధర్మశాస్త్ర పీఠంలో ..

పద్మనాభం: మద్ది జంక్షన్ శ్రీ ధర్మ శాస్త్ర సేవా పీఠంలో మకర సంక్రాంతి పందర్భంగా సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకాలు జరిపారు. శ్రీధర్మ శాస్త్ర సేవా పీఠంపై ఎంపీపీ కంటుబోతు రాంబాబు మకర జ్యోతి వెలిగించారు. సామవేదం బదరికా వాసు మంత్రాలు పఠించారు.

సింహగిరిపై ముగిసిన ధారోత్సవాలు


అప్పన్న ఉత్సవమూర్తుల చెంతన పాశుర విన్నప పఠనం చేస్తున్న స్థానాచార్యులు, అర్చకులు


స్వామి, అమ్మవార్లను తిరువీధిగా తీసుకొస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై ధారోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిని,గోదాదేవి ఒక పల్లకీలో, మదన గోపాలస్వామిని వేరొక పల్లకీలో అధిష్ఠింపజేశారు. సువర్ణ అమ్మవారిని, చతుర్భుజ తాయారు అమ్మవారిని, ఆళ్వారులను మరో పల్లకీలో వేంచేయజేసి మేళతాళాల మధ్య ఆలయం నుంచి తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ విశేషంగా స్నపనం నిర్వహించారు. అనంతరం గంగధార వద్ద ఉన్న ప్రాచీన మండపంలో స్వామిని, అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు. పాశుర విన్నప పఠనం చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్,ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు,అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8గంటల వరకు నిర్వహించిన ఈ పూజ లో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

18న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 18న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆభరణాల ఊరేగింపు


ఆభరణాలను ఊరేగిస్తున్న గ్రామ పెద్దలు


అలంకరణలో అయ్యప్ప స్వామి

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలో గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడు పీలా రమణ అయ్యప్ప స్వామి ఆభరణాలను తలపై మోసుకుంటూ గ్రామంలో ఊరేగించారు. మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అయ్యప్ప స్వామి ప్రసాదాన్ని అందజేశారు. గ్రామ పెద్దలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గో పూజ

సింహాచలం: కనుమ పండగ పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంకి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో మంగళవారం గోపూజలు విశేషంగా జరిగాయి. గోశాలలోని ఆవులకు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పసుపుకుంకుమలు సమర్పించారు.


గోవుకు మేత తినిపిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సామాన్యుల సేవలో మాస్టర్ ఈకే సంస్కృతి సదన్

మహారాణిపేట : సామాన్యులకు తన వంతు సేవలందించడమే మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ ప్రధాన ఆశయమని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురుపీఠం) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ పేర్కొన్నారు. పీఠం గత ముప్పై సంవత్సరాల నుంచి చేసిన సేవల వివరాలతో కూడిన సావనీర్ (ప్రత్యేక సంచిక)ను అంకోసా ఫంక్షన్ హాల్లో ఆవిష్కరించారు. అనేక ఆధ్యాత్మిక, సేవా సంస్థలకు మార్గదర్శకత్వం వహించిన మాస్టర్ ఈకే, పార్వతీకుమార్ సత్సంకల్పానికి ప్రతిరూపమే మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ అని ఆయన అన్నారు. 1994లో స్వర్గీయ డాక్టర్ టి.వి.వి.ఎస్. రావు నేతృత్వంలో ఇక్కడ మాస్టర్ హోమియో వైద్యాలయం ఏర్పాటు చేసి వేలాది మందికి ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు 444 మందికి ఉచిత విద్యనందించినట్లు తెలిపారు. సంస్కృతీ భవన్ నిర్మాణానికి సహకరించిన ప్రభుత్వ అధికారులు, దాతలు, కార్యకర్తలకు సత్యదేవ్ కృతజ్ఞతలు తెలిపారు జగద్గురుపీఠం సలహా మండలి సభ్యులు సి.హెచ్.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ నిస్వార్థ సేవ, ఆధ్యాత్మిక సాధన, త్యాగనిరతి అనేవి తరించడానికి దోహదపడతాయన్నారు. యజ్ఞార్థ జీవనాన్ని మాస్టర్ ఈకే అలవరిచారన్నారు. బాలవికాస కేంద్రంలో 324 మంది చిన్నారులకు ప్రవేశం కల్పించామన్నారు. సంగీత జనకులం ద్వారా కూడా సేవలందిస్తున్నామని ఆయన చెప్పారు. ట్రస్ట్ జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.వి.ఎస్.మూర్తి, నిర్వాహక సభ్యులు అజ్జరపు శ్రీనివాస్, యు.సి.హెచ్.బి. వర్మ, సర్కిల్ ఆఫ్ గుడ్ విల్ కార్యనిర్వాహక సభ్యులు జి.వి.ఎన్. హరి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సీహెచ్ఎస్ఎన్ రాజు, సత్యదేవ్, బీఆర్‌కే రాజు

లలితా దీక్షలు ప్రారంభం


స్వామీజీ చేతుల మీదుగా లలితా దీక్ష తీసుకుంటున్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో సంక్రాంతి రోజున లలితా దీక్షలు ప్రారంభమయ్యాయి. మాఘ పౌర్ణమి వరకు 21 రోజుల పాటు దీక్ష కొనసాగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కుర్తాళం నుంచి వచ్చిన పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి శిష్యుడు సత్యానంద భారతి స్వామి చేతుల మీదుగా పలువురు భక్తులు అమ్మవారి దీక్ష తీసుకున్నారు. ఈ సందర్భంగా లలితాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.